క్లుప్తంగా

జాబ్‌మేళాకు విశేష స్పందన



మాట్లాడుతున్న ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు

ఆదోని అర్బన్ : రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు స్పందన లభించిందని సంస్థ నిర్వాహకులు కట్టా భాస్కర్ ప్రతాప్, సంస్థ డైరెక్టర్ కట్టా స్వామిదాసు తెలిపారు. ఆదోని డివిజన్‌లోని నందవరం, ఎమ్మిగనూరు, పెద్దకడబూరు, మంత్రాలయం, ఆస్పరి, ఆలూరు, కోసిగి, కౌతాళం, చిప్పగిరి, మద్దికెర మండలాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులు 150 మంది హాజరవగా బిగ్‌బాస్కెట్, ఐసీఐసీఐ బ్యాంక్, నవభారత్ ఫర్టిలైజర్, శ్రీసిటీ కంపెనీలకు 90 మంది ఎంపికయ్యారని చెప్పారు. రిలయన్స్ ఫౌండేషన్ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

నిర్దేశించిన ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకోవాలి

ఆదోని టౌన్ : ఝాన్సీ లక్ష్మిభాయి (జేఎల్‌బీ) కూరగాయల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన ఫుట్‌పాత్‌లు, షాపులలోనే వ్యాపారాలు నిర్వహించాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యాపారాలు చేసుకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే కూరగాయల వ్యాపారాలు చేసుకోవాలని చెప్పారు. శుక్రవారం జేఎల్‌బీ మార్కెట్‌ను పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, రోడ్లపై వ్యాపారాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నేషనల్ స్కూల్ పార్కు, రాంజల చెరువు సమీపంలోని దోబీఘాట్‌ను తనిఖీ చేసి నిర్మాణ పనులను పరిశీలించారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి

కౌతాళం: బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి సూచించారు. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలు, వివిధ సంఘాల నాయకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 29వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా ఖుర్బానీని బహిరంగ ప్రదేశాల్లో చేసుకోరాదన్నారు. ఈద్గాల వద్ద ప్రశాంత వాతవరణంలో నమాజులు ఆచరించాలని కోరారు. ప్రశాంతతకు మారుపేరైన కౌతాళం ఖ్యాతిని కొనసాగించాలని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు మారుతీ మోహన్, మౌలానా అక్బర్, టైలర్‌బాషా, లడ్డుఖాదర్‌బాషా, కోక్‌బాషా పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి జైలు

ఆదోని రూరల్ : చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఆదోని కోర్టు ఆరు నెలల జైలుశిక్ష విధించిందని న్యాయవాది వీరేష్ శుక్రవారం తెలిపారు. పట్టణానికి చెందిన మహ్మద్ జుబేర్ 2017, మార్చి 28న శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్‌లో రూ.2,09,000 అప్పు తీసుకున్నాడు. అందుకు గానూ చెక్కులు ఇవ్వగా ఆ చెక్కులు బౌన్స్ కావడం,అప్పు చెల్లించకపోవడంతో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ వారు 2018 సెప్టెంబర్ 27న కోర్టులో కేసు నమోదు చేసిందన్నారు. కేసు పూర్వాపరాలను విచారించిన ఆదోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి చెక్ బౌన్స్ కేసు కింద జుబేర్‌కు ఆరు నెలలపాటు జైలుశిక్షతో పాటు రూ.4,18,000 జరిమానా విధించారని వివరించారు.

ప్రత్యేక హోమాలు



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: మంత్రాలయంలో ఎమ్మిగనూరు రోడ్డు వైపున అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో నిర్మించనున్న 108 అడుగుల పంచలోహ విగ్రహ స్థలంలో ప్రత్యేక పూజలు, హోమాలను జై శ్రీరామ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నమూనా పంచలోహ శ్రీరాముడి విగ్రహం వద్ద పండితులు దోస్ రాఘవేంద్ర తదితరులు శ్రీరామ షడక్షర మంత్ర హోమం, భూ వరాహ మంత్రహోమం, సుదర్శన హోమాలను జరిపించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే శ్రీనివాస కల్యాణం, సుందరకాండ పారాయణం చేపట్టారు. మంత్రాలయం గ్రామ సర్పంచ్ భీమయ్య, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

గౌరవం.. భద్రత

- పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం
- ప్రభుత్వ ఉద్యోగులుగా సిబ్బందికి గౌరవం, గుర్తింపు
- పెరిగిన ఉద్యోగ భద్రత
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజారవాణా సంస్థ ఉద్యోగులు



ఆదోని ఆర్టీసీ డిపోలో ఆగి ఉన్న బస్సులు

ఆదోని టౌన్: గత ప్రభుత్వాల చర్యలతో ఆర్టీసీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. సిబ్బందికి జీతాలు అందేవి కాదు. కార్మికులపై పనిభారం, అనవసరమైన ఒత్తిళ్లు, ఇంక్రిమెంట్లు కటింగ్, చిన్న చిన్న కారణాలకు సైతం బలిపశువులను చేసేవారు. బలవంతంగా సర్వీసు (రిమూవ్) నుంచి తొలగించేవారు. వీటికి తోడు అనేక సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడేవారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేస్తారనే భయాందోళన సృష్టించడంతో వారిలో ఆందోళన, అభద్రతా భావం పెరిగిపోయింది. ప్రైవేటీకరణ చేస్తే సంస్థ ఇక అధోగతిపాలేనని ఉద్యోగుల్లో ఆందోళన పెరిగిపోయింది.

పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు..

ప్రతిపక్ష నేత హోదాలో పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆర్టీసీ సిబ్బంది కలిసి తమ కష్టాలను చెప్పుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, పెన్షన్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వంలో విలీనం చేస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని నాడు మాట ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఏడాదికే (2020లో) హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారు. దీంతో ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులుగా గుర్తింపు పొందారు. ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు వస్తున్నాయి. ప్రభుత్వానికి ఎన్ని కష్టాలు ఉన్నా ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం 1వ తేదీనే అందుతుండటంపై ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విలీనం కావడంతో ఉన్నతాధికారులతో పాటు కింది స్థాయి ఉద్యోగులకు మేలు జరుగుతోందని డ్రైవర్లు, కండక్టర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల వివరాలు..

- ఆదోని ఆర్టీసీ డిపోలో 341 మంది ఉద్యోగులు ఉన్నారు. అందులో డ్రైవర్లు 191 మంది, కండక్టర్లు 112 మంది, అధికారులు 25 మంది, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు 13 మంది పనిచేస్తున్నారు.
- పత్తికొండ డిపోలో 28 బస్సులు, 150 మంది సిబ్బంది ఉన్నారు. ఇందులో 45 మంది డ్రైవర్లు, కండక్టర్లు 35 మంది, సిబ్బంది 60 మంది ఉన్నారు.
- ఎమ్మిగనూరు డిపోలో 72 బస్సులు ఉన్నాయి. మొత్తం 331 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 132 మంది డ్రైవర్లు, 108 మంది కండెక్టర్లు, మిగిలిన వారు సిబ్బంది ఉన్నారు.

డిపోలో రోజువారీ కలెక్షన్

డిపోలో 82 బస్సులు, 76 షెడ్యూల్స్ నడుస్తున్నాయి. రోజుకు రూ.12 లక్షల వరకు కలెక్షన్ వస్తుంది. అయితే డిపోను బస్సుల కొరత వేధిస్తోంది. మరో 20 బస్సులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. అవసరం మేరకు బస్సులుంటే మరింత ఆదాయం లభిస్తుందంటున్నారు.

ఉద్యోగులకు మేలు జరిగింది



ఆర్టీసీ విలీనంతో ఉద్యోగుల కష్టాలు దాదాపుగా తీరిపోయాయి. అయితే అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయి. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా కొందరు వ్యవహరిస్తున్నారు. అరియర్స్, సిక్ లీవ్‌లకు సంబంధించిన మొత్తం వచ్చాయి. డ్రైవర్, కండక్టర్‌లు, మెకానిక్‌లు, ఔట్ సోర్సింగ్ డ్రైవర్లకు విలీనంతో మేలు జరుగుతోంది.

– జి.రఘు, వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిపో కార్యదర్శి

నెలనెలా జీతాలు వస్తున్నాయి



ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కాకముందు నెలనెలా జీతాలు వచ్చేవి కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలీనం చేయడంతో ప్రతినెలా 1వ తేదీనే వేతనాలు అందుతున్నాయి. పెండింగ్ బిల్లులు అందాయి. కరోనా సమయంలోనూ ఆర్టీసీ ఉద్యోగులకు నెలనెలా వేతనాలు ఇచ్చిన ఘనత సీఎందే. జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– కె.సురేంద్రరావు, ఆదోని డిపో ఆర్టీసీ డ్రైవర్,

ఉద్యోగులకు మేలు జరుగింది



ఆర్టీసీ ప్రభుత్వంలోకి విలీనం కావడంతో ఇటు సంస్థకు, ఉద్యోగులకు మేలే జరుగుతుంది. అయితే పింఛన్ వసతి కల్పించాలి. జీతాలతో పాటు మెడికల్ బెనిఫిట్స్ కల్పించాలి. పాత పద్ధతిలోనే ప్రయోజనాలు కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందాం. ప్రతినెలా 1వ తేదీన జీతాలు ఇచ్చేందుకు ప్రభుత్వం పది వేల కోట్లు కేటాయించింది.

– కె.లక్ష్మన్న, ఏడీసీ

విలీనంతో సంస్థ మనుగడ



ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేయడంతో సంస్థ మనుగడ సాధ్యమైంది. నష్టాల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆదుకునేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లింపుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అందరికీ మంచే జరుగుతుంది.

– మహ్మద్‌రఫిక్, ఆదోని డిపో మేనేజర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్ : పట్టణంలోని కల్లుబావిలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతులు ఉండటంతో పట్టణంలో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దాం

పెద్దకడబూరు : విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి భాస్కర్‌యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం వినియోగదారులను నిలువునా ముంచుతుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ సిబ్బంది రమేష్‌బాబు, అబ్దుల్ రఫీక్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు వీరేష్, ఆంజనేయ, చంద్ర, శివ, హనుమంతు, రామాంజనేయులు పాల్గొన్నారు.

కోలుకుంటున్న బాలుడు

ఆదోని అర్బన్ : పట్టణంలోని హనుమాన్‌నగర్‌లోని రాజరాజేశ్వరి కాలనీకి చెందిన కొండ, శిరీష దంపతుల కుమారుడు కౌశిక్ అనే బాలుడు తిరుపతిలో కోలుకుంటున్నాడని బాలుడి బంధువులు తెలిపారు. గురువారం ఆదోని నుంచి తిరుమల దర్శనానికి వెళ్లగా అలిపిరి నుంచి మెట్లపై బాలుడిపై చిరుత దాడి చేసిన విషయం తెలిసిందే. గాయపడిన బాలుడు తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, కోలుకుంటున్నట్లు బంధువులు చెప్పారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



మరాతీగేరిలో భూమిపూజ చేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్ : పట్టణంలోని 31వ వార్డు మరాతీగేరిలోని ఆ వార్డు కౌన్సిలర్ పద్మ, రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి మురుగు కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ రూ.10.50 లక్షలతో పనులు చేపట్టామని చెప్పారు. అక్కడక్కడ మిగిలిపోయిన ప్రాంతాల్లోనూ పనులు పూర్తి చేస్తామని మనోజ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు ఫయాజ్‌అహ్మద్, మహ్మద్ స్వామి, నాయకులు జైపాల్, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, కృపాకర్ పాల్గొన్నారు.

ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

పెద్దకడబూరు : మండలంలోని మేకడోణ గ్రామంలో శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్ ఆధ్వర్యంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ నీటి సమస్యను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా జలజీవన్ మిషన్ కింద రూ.56.45లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. దీంతో బీసీ, ఎస్సీ కాలనీలకు సరిపడా 90వేల లీటర్ల సామర్థ్యం గల ఓహెచ్‌ఆర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణగౌడ్, కోఆప్షన్ సభ్యుడు షేర్‌ఖాన్‌పటేల్, నాయకులు జాము మూకయ్య, వీరేంద్రగౌడ్, నాగేంద్రగౌడ్, మల్లేష్ పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



వగ్గా మౌనిక

కోసిగి: మండల కేంద్రానికి చెందిన వగ్గా చంద్రశేఖర్, పవిత్ర దంపతుల కుమార్తె మౌనిక ఎమ్మిగనూరు మండలం బనవాసి నవోదయకు ఎంపికైంది. 2023–2024 కు గానూ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపి సీటు సాధించిందని ఎమ్మిగనూరు నవోదయవిద్యాలయం ప్రిన్సిపాల్ చందిరన్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

కోసిగి: బాలింతలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల నాయకుడు పి.మురళీ మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం పెద్దభూంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ నాయకులతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. నాయకులు గట్టు బీముడు, చిన్నభూంపల్లి ఉసేని, లక్ష్మీరెడ్డి, అంజినయ్య, అంజి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కౌతాళం: ఎంపీపీ అమరేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

ఆదోని సెంట్రల్: గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భరత్‌కుమార్, శ్రీనివాసులు కోరారు. బస్సు సౌకర్యం లేక అనేక మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజరు రఫీకి వినతి పత్రం అందజేశారు. గణేష్, నాగరాజు, గౌస్. వెంకటేశ్, పవన్, ఈరన్న పాల్గొన్నారు.

విద్యాసదస్సును జయప్రదం చేయండి

ఆదోని సెంట్రల్: ఈ నెల 25వ తేదీన కర్నూలులోని జిల్లా పరిషత్ హాలులో జరిగే ఫ్యాప్టో విద్యాసదస్సును విజయవంతం చేయాలని నాయకులు భాస్కర్, నరసయ్య, సునీల్, వీరచంద్రయాదవ్ కోరారు. ఏపీటీఎఫ్ కార్యాలయంలో నాయకులు తిక్కస్వామి అధ్యక్షతన శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల సమావేశం జరిగింది. నాయకులు శ్రీనివాసులు, మధు, సుబ్బారెడ్డి, రాము, గిరిబాబు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఆదోని సెంట్రల్: విద్య పేరుతో దోపిడీకి పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణకాజా కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలల యాజమాన్యాల పట్ల కఠినంగా వ్యవహరించాలని శుక్రవారం డిప్యూటీ తహసీలారు రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

బైక్‌ను ఢీ కొట్టిన బొలేరో.. ఒకరికి గాయాలు



బైక్‌ను ఢీకొన్న బొలెరో వాహనం

కౌతాళం: మండల కేంద్రం సమీపంలోని బంటకుంట రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలోని మాటూరుకు చెందిన రామన్న మండలంలోని సుళేకేరి గ్రామంలో తన కూతురుని చూడడానికి వచ్చి కౌతాళం మీదుగా స్వగ్రామానికి వెళ్తుండగా బంటకుంటకు చెందిన బొలెరో వాహనం కౌతాళం సమీపంలో రామన్న బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో రామన్నకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆదోనికి ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం రూరల్: రచ్చుమర్రి గ్రామానికి చెందిన కడతట్ల నాగరాజు ద్విచక్రవాహనంపై 96 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా మాధవరం వద్ద దాడి చేసిన పట్టుకున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ద్విచక్రవాహనం, మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఘర్షణ.. కేసు నమోదు

మంత్రాలయం రూరల్: మాధవరం గ్రామంలో ఇంటి స్థలం విషయంలో రెండు కుటుంబాల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మి, నరసింహారెడ్డి దంపతులతో పక్కనే నివాసముంటున్న మరో కుటుంబం మధ్య స్థలం కోసం వాగ్వాదం జరిగింది. మాటమాట పెరగడంతో లక్ష్మి, నరసింహారెడ్డిపై నర్సిరెడ్డి, ఉరుకుంద, దుల్లమ్మ, అయ్యమ్మ, మరో ఇద్దరు కలసి దాడి చేశారు. దీంతో వారు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్‌బాబు తెలిపారు.

ఆదోనిలో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని బాబాగార్డెన్ సమీపంలో ఉన్న అరుణ్‌కుమార్ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల మేరకు.. 20 రోజుల క్రితం పని నిమిత్తం బెంగళూరుకు వెళ్లామని, శుక్రవారం ఉదయం వచ్చి చూడగా ఇంట్లో బీరువా తాళం పగలగొట్టి రెండు వెండి గ్లాసులు, రెండు గ్రాముల బంగారు ఉంగరం, ఒక జత కాళ్ల పట్టీలు, దేవుడు హుండీని దొంగించారని చెప్పారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.

మల్లన్న సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



మల్లన్నను దర్శించుకున్న అనంతరం ఆలయంలో న్యాయమూర్తి దంపతులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను కర్ణాటక న్యాయమూర్తి జస్టిస్ జి.బసవరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శుక్రవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వారికి ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. దర్శనం అనంతరం అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఏఈవో హరిదాసు స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేసి సత్కరించారు.

వైభవంగా వరదేంద్రతీర్థుల పూర్వారాధన



వరదేంద్ర బృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు

మంత్రాలయం : మధ్వమత మూల సంస్థానం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతి వరదేంద్ర తీర్థుల పూర్వరాధన వేడుకలు వైభవంగా జరిగాయి. శుక్రవారం మహారాష్ట్రలోని పూణే నగరంలో వరదేంద్ర తీర్థుల మూల బృందావన క్షేత్రంలో పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా వరదేంద్ర బృందావానికి నిర్మల్య విసర్జన, సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభించారు. పుష్పాలంకరణలతో అభిషేకాలు గావించి విశిష్ట పూజలు జరిపించారు. పండితుల మంత్రోచ్ఛారణలు, అశేష భక్త జనం మధ్య వేడుకలు కనుల పండువగా సాగాయి. అనంతరం జరిగిన మూలరాముల సంస్థాన పూజలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఆలయాల జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం



భూమి పూజ చేస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని పెద్దభూంపల్లి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల జీర్ణోద్ధరణ పనులకు శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చొరవతో నియోజకవర్గంలో 31 దేవాలయాల అభివృద్ధికి రూ.3.10 కోట్లు మంజూరయ్యాయని, ఇందులో మండలంలో 18 పురాతన దేవాలయాలను ఎంపిక చేశారని, ఒక్కో దేవాలయానికి రూ.10లక్షలు టీటీడీ వారు కేటాయించారని చెప్పారు. భీమయ్య, లక్ష్మీరెడ్డి,అంజినయ్య, బసవరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకంపై అవగాహన

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష పథకంపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు, వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మణిమంజరి ఆధ్వర్యంలో నిర్వహించారు. జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవాన్ని ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మజ్జిగ గోవిదమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, ఎంపీటీసీలు వెంకటేశు, గనదాల వెంకటేశు, అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేదస్వరూప, పీఆర్‌ఏఈ నరసింహులు, ఈవో పీఆర్‌డీ ప్రభావతి పాల్గొన్నారు.

కోసిగి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు పి. మురళీ మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం డి.బెళగల్ గ్రామ సచివాలయ ఆవరణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు నరసన్న, వీరన్న గౌడ, సాతర్ల నాగమ్మ, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

హేళన చేస్తున్నాడనే హత్య

- నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- సీసీ ఫుటేజీ ద్వారా నిందితుల గుర్తింపు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని అర్బన్: ఇప్పటికే పలుమార్లు హేళన చేశావు.. ఇక నుంచి మానుకోవాలని హితవు పలికినా నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతోనే మద్యం సేవించడానికని పిలిచి శంకర్‌ను మిత్రులే కడతేర్చారని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఈనెల 19న పట్టణంలో కర్రతో దాడి చేసి హత్య చేసిన ఘటనలో నిందితులు శుక్రవారం స్థానిక ఆస్పరి బైపాస్ వద్ద ఉన్నారనే సమాచారం మేరకు త్రీటౌన్ సీఐ నరసింహారాజు, ఎస్‌ఐలు చిన్నపీరయ్య, జైశంకర్ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారిని స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఆధ్వర్యంలో మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీజ్ చేసిన ఆటో, హత్యకు వినియోగించిన కర్రను ప్రదర్శించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. మృతుడితో పాటు కోసిగి మండలం కందుకూరు గ్రామానికి చెందిన రామలింగడు, పట్టణంలోని తిరుమలనగర్ కాలనీకి చెందిన జగన్నాథరెడ్డి, అలసుందిగుత్తి గ్రామానికి చెందిన జయరామిరెడ్డి, క్రాంతినగర్‌కు చెందిన రామకృష్ణ స్నేహితులు. ఐదుగురు కలిసి తరచూ మద్యం సేవించేవారు. వీరిలో శంకర్ మద్యం మత్తులో నలుగురిని కించపరిచేలా అవహేళన చేస్తూ మాట్లాడేవాడు. అలాగే బయట వ్యక్తుల ఎదుట కూడా హేళన చేసేవాడు. తమను హేళన చేయవద్దని మిగిలిన నలుగురు పలుమార్లు చెప్పినా శంకర్ పట్టించుకోకపోగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చేవాడు. దీంతో శంకర్‌కు ఎలాగైనా బుద్ధి చెప్పాలని మాట వినకుంటే చంపాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 19న ఉదయం రామకృష్ణ ఆటోలో ఎమ్మిగనూరు బైపాస్ వద్దకు అందరూ చేరుకున్నారు. అక్కడ మద్యం సేవిస్తూ.. తమ గురించి ఇక నుంచి చెడుగా మాట్లాడవద్దని సూచించారు. అందుకు శంకర్ అంగీకరించలేదు. వెంటనే చంపడానికి ప్రయత్నించగా శంకర్ అల్లుడు ఉండటంతో ప్రయత్నాన్ని విరమించుకున్నారు. తిరిగి ఆటోలో ఎమ్మిగనూరు బైపాస్ వద్దనున్న మారెమ్మ గుడి సమీపంలోకి చేరుకున్నారు. ఈ సమయంలో జయరామిరెడ్డి సూచనతో రామలింగడు కట్టెతో శంకర్‌పై దాడి చేశాడు. కింద పడిపోయినప్పటికీ పలుమార్లు బలంగా కొట్టాడు. మృతి చెందాడని భావించి వారంతా అక్కడి నుంచి పారిపోయారు. గమనించిన స్థానికులు అపస్మారకస్థితిలో ఉన్న శంకర్‌ను ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఈనెల 20న మృతి చెందాడు. కేసు నమోదైందని తెలుసుకున్న నలుగురూ లాయర్‌ను కలవడానికి వెళ్తుండగా పోలీసులు అరెస్టు చేశారని వివరించారు. కేసును నాలుగు రోజుల్లో ఛేదించిన సీఐ నరసింహారాజు, ఎస్‌ఐలు చిన్నపీరయ్య, జైశేఖర్‌ను డీఎస్పీ అభినందించారు. కాగా.. శంకర్‌పై జరిగిన దాడి సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. కేసు ఛేదనలో పోలీసులకు ఆ ఫుటేజీ ఆధారంగా మారింది.

చురుగ్గా రోడ్డు మరమ్మతు పనులు

హొళగుంద: ఆదోని మార్గంలోని ధణాపురం–హొళగుంద రోడ్డులో తాత్కాలిక మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాళ్లు తేలి, గుంతలు పడి అధ్వానంగా మారిన ఈ రోడ్డులో ప్రజలు ప్రయాణించేందుకు ఇబ్బందిగా ఉండేది. ఈ మార్గంలో 25 కి.మీ మేర డబుల్ రోడ్డు ఏర్పాటుకు రూ.59 కోట్లు నిధులు మంజూరై కొద్దిగా పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే కాంట్రాక్టర్ అర్ధాంతరంగా పనులు నిలిపి వేశాడు. దీంతో బస్సులను వేరే రూటులో తిప్పిన ఆర్టీసీ అధికారులు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ఒకటి, రెండు గ్రామాలకు మినహాయించి పాత రూట్లలోనే బస్సులను తిప్పుతున్నారు.

మంత్రి సొంత ఖర్చుతో పనులు

మంత్రి గుమ్మనూరు జయరాం సదరు కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులపై ఒత్తిడి తెచ్చినా ఆలస్యమవుతుండడంతో సోమవారం నుంచి సొంత ఖర్చుతో తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఇప్పటివరకు దాదాపు 15 కి.మీ హొళగుంద నుంచి హెబ్బటం వరకు దెబ్బతిన్న చోట రోడ్డును చదును చేశారు. ప్రస్తుతం జరిగిన టెండర్‌ను రద్దు చేయించి ఎస్టిమెట్ కాస్ట్ పెంచి కొత్త రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు మంత్రి చర్యలు తీసుకుంటారని, అలాగే మార్గమడికి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తారని గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి తెలిపారు.



ఆదోని రోడ్డులో గ్రావెల్ వేసి చదును చేసిన దృశ్యం